క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో..



తలకొండపల్లిలో అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న రమేశ్

తలకొండపల్లి: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని 108 ప్రోగ్రాం మేనేజర్ రమేశ్ ఆదేశించారు. రోగుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే స్పందించి, తక్షణమే అంబులెన్స్‌ను తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలో ఆయన 108 అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసి వైద్య పరికరాలు పరిశీలించారు. అనంతరం ఆక్సిజన్ సరాఫరా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఎంటీ పైలట్ రమేశ్, పైలట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మంగళపల్లి-చెన్నారం రోడ్డు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామం నుంచి తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డును అనూష ప్రాజెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ జలంధర్‌రెడ్డి సహకారంతో మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. జలందర్‌రెడ్డి సహకారంతో దాదాపు 4 కిలోమీటర్ల రోడ్డుకు మరమత్తు పనులు చేపట్టారు. పనులను గురువారం వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, స్థానిక నాయకులు పరిశీలించారు.

రైతు శ్రేయస్సు కోసమే..



ప్రతిజ్ఞ చేస్తున్న సత్తయ్య తదితరులు

తుర్కయంజాల్: సహకార సంఘాలు రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నాయని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వారం రోజుల పాటు సహకార వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, సహకార సంఘాలు ఎప్పటికప్పుడు పరిణతి చెందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు, సీఈఓ రాందాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సబితారెడ్డి ఎన్నికల ప్రచారం

కందుకూరు: మండల పరిధిలో తొమ్మిది గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు జెడ్పీడీసీ జంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లో ప్రారంభమై.. కొలన్‌గూడ, గుమ్మడవెల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, అన్నోజిగూడ, గూడూరు, కటికపల్లి గ్రామాల్లో ప్రచారం కొనసాగనుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



చల్లా నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

మీర్‌పేట: మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ధీమావ్యక్తం చేశారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ దాసరి నారాయణ కాలనీకి చెందిన సైదులు యాదవ్, రవియాదవ్, రాజేందర్ ముదిరాజ్, మహేశ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం నర్సింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రచారం

తుక్కుగూడ: కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు.

లోపించిన నిఘా..!

- మాల్ మార్కెట్‌కు భద్రత కరువు
- సులువుగా తప్పించుకుంటున్న దొంగలు
- నిఘాలేక జోరుగా బ్లాక్ దందా
- ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



మాల్ మార్కెట్

యాచారం: నిత్యం వేలాది మంది వినియోగదారులతో రద్దీగా ఉండే మాల్ మార్కెట్‌లో నిఘా కరువైంది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో మాల్ మార్కెట్ ఉంది. వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. రూ. కోట్లలో లావాదేవీలు జరుగుతుంటాయి. రూ.కోట్లు తెచ్చిపెడుతున్న మార్కెట్‌లో రక్షణ లేకుండా పోయింది. మాల్ కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు వినియోగదారులు వేడుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దొంగలకు రాచమార్గం

రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో మార్కెట్ ఉండడంతో చోరీలు చేసి దొంగలు సులభంగా తప్పించుకుంటున్నారు. దొంగలు ఓ మండల పరిధిలో చోరీలు చేస్తూ మరో మండలంలోకి జారుకుంటున్నారు. ఏ మండల పోలీసులకు ఫిర్యాదు చేయాలో తెలియక బాధితులు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌కు రంగారెడ్డి జిల్లాలోని యాచారం పోలీస్‌స్టేషన్ 9, నల్గొండ జిల్లాలోని మర్రిగూడ మండల పోలీస్‌స్టేషన్ 15, చింతపల్లి పోలీస్‌స్టేషన్ 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆయా పోలీస్‌స్టేషన్లలో మొబైల్ వాహనాలు ఉన్న సరైన సమయంలో అందుబాటులో లేక అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

జోరుగా బ్లాక్ దందా

నిఘా లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు మాల్ వ్యాపార కేంద్రం అడ్డాగా మారింది. పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. రేషన్ బియ్యం, బెల్లం విక్రయాలు, గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్, నకిలీ వైద్యం, హోటల్లో మద్యం విక్రయాలు, నకిలీ విత్తనాల అమ్మకాల దందా జోరుగా సాగుతుంటుంది. ప్రతి మంగళవారం జరిగే పశువుల సంత, అంగడి జరుగుతుంది. ఆ రోజు బ్లాక్ దందాకు అదుపు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు.

వైఎస్సార్ హయంలో...

సీఎం వైఎస్సార్ హయాంలో మాల్ కేంద్రంలో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి హోంమంత్రి జానారెడ్డి సీఎంతో మాట్లాడి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. వైఎస్సార్ అకాల మరణంతో పీఎస్ ఏర్పాటు కలగానే మారింది.

జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లా



రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్ హయాంలో అప్పటి హోం మంత్రి జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. స్థలాన్ని ఎంపిక చేయాలని రెండు జిల్లాల అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అవుతుందని సంతోషించాం. కానీ సాధ్యం కాలేదు.

– రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, యాచారం

స్థలం కేటాయిస్తాం



మాల్ వ్యాపార కేంద్రంలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు సులువుగా తప్పించుకుంటున్నారు. ఓ మండలంలో చోరీ చేసి పక్కనే ఉన్న మండలంలోకి వెళ్లిపోతున్నారు. ఏ పోలీసులకు ఫిర్యాదులు చేయాలో తెలియక బాధితులు గందరగోళంలో ఉన్నారు. నా దృష్టికి పలు ఫిర్యాదులు వచ్చాయి. మాల్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే స్థలాన్ని కేటాయిస్తాం.

– పదకంటి కవిత, సర్పంచ్, మాల్ గ్రామం

సంబురంగా 'సదర్'



సదర్‌లో పాల్గొన్న మల్లేశ్ తదితరులు



ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ చౌరస్తాలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంబురంగా నిర్వహించిన వేడుకల్లో యాదవులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్నం వీధుల గుండా సదర్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు, యువకుల నృత్యాలు సదర్ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకుముందు దున్నరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కులదేవతలను వేడుకుంటూ ఆడిన ఆటపాటలు, డిల్లెం బల్లం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలు సంఘం నాయకులు మంగల్‌పల్లి యాదయ్య, అందెల బాలయ్య, ముంత జంగయ్య, యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్, యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లింగం, గౌరవ అధ్యక్షుడు కసరమోని మల్లేశ్, చింతం బాల్‌రాజ్, ముసలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సదర్

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దున్నపోతులను ప్రత్యేకంగా అలకంరించి ఊరేగించారు. ఈ సందర్భంగా దున్న పోతుల విన్యాసాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శివ యాదవ్, సర్పంచ్ కృష్ణయ్యయాదవ్, పరమేశ్, మహేందర్, రాజేందర్, కొండల్, వెంకటేశ్, రామకృష్ణ, రాము, శ్రీశైలం, నవీన్, శ్రీను, యాదయ్య తదితరులు ఉన్నారు.

కుర్మిద్దలో సదర్

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో బుధవారం రాత్రి సదర్ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ, కురుమ సోదరులు ఐక్యంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సదర్ ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల్లో జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో గురువారం జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేడుకల్లో భాగంగా స్థానిక మౌలాలి పహాడ్ దర్గా సమీపంలో గౌసేపాక్ చిల్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం మతగురువు హజ్రత్ సయ్యద్ జిలానీపాషా ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలో ముస్లింలతో కలిసి గ్యార్మీ షరీఫ్ జెండాను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, దువా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖలీల్ నివాసంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, మతగురువులు మౌలానా అబ్దుల్ ఖరీం, అబ్దుల్ వాహేబ్, ముస్లింలు పాల్గొన్నారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా బాలాజీసింగ్



బాలాజీసింగ్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: పీసీసీ అధికార ప్రతినిధిగా నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌ను నియమించారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి నియామక ఉత్తర్వులను బాలాజీసింగ్‌కు అందజేశారు. అనంతరం ఆయనను కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం కేశవులు, జంగయ్య ఘనంగా సత్కరించారు.

ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ నాంపల్లి భానుచందర్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామీణ వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు గురువారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి.. రూ.38వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. భానుచందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు.

కారు.. జోరు..



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీ, డాక్టర్స్‌కాలనీ, నార్త్ వికాస్ నగర్, సాయికృష్ణ నగర్‌లలో సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను వారు అభ్యర్థించారు. మరోసారి సబితారెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్పల్లి అశోక్, బేర బాలకిషన్, అంకిరెడ్డి పాల్గొన్నారు.

'మత్తు' రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

షాద్‌నగర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న మత్తు పదార్థాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ అంజనీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాండుగౌడ్ అనే వ్యక్తి షాద్‌నగర్ నుంచి నాగులపల్లి గ్రామం వైపు ద్విచక్రవాహనంపై 750 గ్రాముల ఎన్‌డీపీఎస్ అనే మత్తు పదార్థాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నాడు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. మత్తు పదార్థాన్ని రవాణా చేస్తున్న పాండుగౌడ్ వాహనాన్ని వారు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అతని వద్ద ఉన్న మత్తు పదార్థాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

- ప్రధానోపాధ్యాయురాలు రేణుక
- అమ్డాపూర్‌లో స్వపరిపాలన దినోత్సవం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. గురువారం అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ విద్యార్థులు ధైర్య సాహసాలతో ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులకు అన్ని రంగాల్లో అవగాహన ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలుగుతామని తెలిపారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో సీఐ బద్యానాథ్

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లోని పలు గ్రామాల్లో సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న గణేశ్ ఇంట్లో తనిఖీ చేశారు. 14 సీసాల బీర్లు, 7బీబీ మద్యం క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గణేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బెల్ట్ షాపులు, మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేఎల్లార్‌ను గెలిపించండి



అగర్‌మియాగూడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణనాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని లేమూరు, అగర్‌మియాగూడ, సరస్వతిగూడ, రాచులూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తారన్నారు. ఈ పథకాలతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు డి.నర్సింహాచారి, జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

పీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత



ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సుజాత, లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామని పీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో భాగంగా ఆర్‌కేపురం డివిజన్, వాసవి కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా కల్వ సుజాత, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ప్రతినెల రూ. 2,500, రూ.400లకే గ్యాస్ సిలిండర్ తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని మోసం చేశారని, కాంగ్రెస్ వారికి తగిన ప్రాధాన్య ఇస్తుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ గుర్తుపై గెలిచి పార్టీ మారిన సబితా ఇంద్రారెడ్డికి ఓటు ద్వారా తగిన బుద్ది చెప్పాలని అన్నారు. ప్రజలకు నిరంతరం సేవ చేసే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపురం మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ కంటెస్టేడ్ కార్పొరేటర్ అభ్యర్థి పున్న నిర్మల గణేశ్ నేత, మ్యాడం సుధాకర్ గుప్తా, వాసవి కాలనీ ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, వాసవి మహిళ మండలి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మహేశ్, ప్రభాకర్

చేవెళ్ల: రాబోయే ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం కోసం కృషి చేస్తూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బేగరి ప్రభాకర్‌లు పేర్కొన్నారు. చేవెళ్లలో గురువారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'దళితులను వీడని అంటరానితనం, పరిస్థితులు మారాలి' అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటినా కూడా ఇంకా దళితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నేటికీ అంటరానితనం రూపుమాపలేదని, అసమానతలు దూరం కావడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు తమ సంఘం తరుపున ప్రవేశపెట్టిన పలు డిమాండ్లను అమలు చేయాలని వారు పేర్కొన్నారు. ఈ డిమాండ్లను నూతనంగా ఏర్పాటైయ్యే ప్రభుత్వాలు అమలు చేయాల్సిందేనని వారు కోరారు. టి ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, రవీందర్, వినోద్, యాదగిరి, శ్రీనివాస్, రవి, రాజేందర్‌రెడ్డి, శివకుమార్, పాల్గొన్నారు.